కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

అభిరామి స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

అభిరామి స్తోత్రమ్ - భావార్థముతో.

01. నమస్తే లలితే దేవి శ్రీమత్సింహాసనేశ్వరి।
భక్తానామిష్టదే మాతః అభిరామి నమోఽస్తుతే॥

లలితా దేవిగా సింహాసనంపై ఆసీనురాలై తన భక్తులకు కొంగుబంగారమైన జగన్మాత అభిరామికి నమస్కరిస్తున్నాను.

02. చన్ద్రోదయం కృతవతీ తాటంకేన మహేశ్వరి।
ఆయుర్దేహి జగన్మాతః అభిరామి నమోఽస్తుతే॥

సమస్త దేవతలకు అధిదేవతయై, తన కర్ణములయొక్క తాటంకములనుండి చంద్రోదయాన్ని కల్పించిన జగన్మాత అభిరామిని ఆయువును ప్రసాదించ వలసినదిగా నమస్కరిస్తున్నాను.

03. సుధాఘటేశశ్రీకాన్తే శరణాగతవత్సలే।
ఆరోగ్యం దేహి మే నిత్యం అభిరామి నమోఽస్తుతే॥

నిత్యం ఆరోగ్యాన్ని ప్రసాదించి ఆశీర్వదించవలసినదిగా ప్రార్థిస్తూ, అమృత ఘటేశ్వరునిగా కొలువై ఉన్న ఈశ్వరుని దేవేరి జగన్మాత అభిరామికి నమస్కరిస్తున్నాను.

04. కళ్యాణి మంగళం దేహి జగన్మంగళకారిణి।
ఐశ్వర్యం దేహి మే నిత్యం అభిరామి నమోఽస్తుతే॥

ఈ సమస్త విశ్వానికి సకల శుభములను సమస్త సన్మంగళములను ప్రసాదించే అనుగ్రహించే కళ్యాణ స్వరూపిణి జగన్మాత అభిరామిని సకల ఐశ్వర్యములను ప్రసాదించవలసినదిగా ప్రార్థిస్తూ నమస్కరిస్తున్నాను.

05. చంద్రమండలమధ్యస్థే మహాత్రిపురసుందరి।
శ్రీచక్రరాజనిలయే అభిరామి నమోఽస్తుతే॥

చంద్ర మండల మధ్యములో స్థితురాలై, త్రిభువనములకు జగదీశ్వరిగా, శ్రీచక్ర మధ్యములోని బిందువులో వసించే జగన్మాత అభిరామికి నమస్కరిస్తున్నాను.

06. రాజీవలోచనే పూర్ణే పూర్ణచన్ద్ర విధాయిని।
సౌభాగ్యం దేహి మే నిత్యం అభిరామి నమోఽస్తుతే॥

పద్మముల వంటి కన్నులు కలిగి, పరిపూర్ణమై, పూర్ణచంద్రుని వలె ప్రకాశించే జగన్మాత అభిరామిని నిరంతరం సౌభాగ్యాన్ని ప్రసాదించవలసినదిగా ప్రార్థిస్తూ నమస్కరిస్తున్నాను.

07. గణేశస్కందజనని వేదరూపే ధనేశ్వరి।
విద్యాం చ దేహి మే కీర్తిం అభిరామి నమోఽస్తుతే॥

గణేశునికి, కుమారస్వామికి కన్నతల్లిగా, వేద స్వరూపిణిగా, ఐశ్వర్యమునకు అధిదేవతగా ప్రకాశించే జగన్మాత అభిరామిని విద్యను, యశస్సును ప్రసాదించ వలసినదిగా ప్రార్థిస్తూ నమస్కరిస్తున్నాను.

08. సువాసినీప్రియే మాతః సౌమాంగళ్యవివర్ధినీ।
మాంగళ్యం దేహి మే నిత్యం అభిరామి నమోఽస్తుతే॥

సువాసిని స్త్రీలకు ఆరాధ్య దేవతగా, మాంగళ్య దేవతగా పూజింపబడే జగన్మాత అభిరామిని సుఖప్రదమైన వైవాహిక జీవితం అనుగ్రహించవలసినదిగా ప్రార్థిస్తూ నమస్కరిస్తున్నాను.

09. మార్కండేయ మహాభక్త సుబ్రహ్మణ్య సుపూజితే।
శ్రీరాజరాజేశ్వరీ త్వం హ్యభిరామి నమోఽస్తుతే॥

మార్కండేయుడు, అభిరామభట్టు వంటి భక్తులచే అర్చించబడి, రాజరాజేశ్వరీ రూపములో పూజలందుకుంటున్న జగన్మాత అభిరామికి మనః పూర్వకముగా నమస్కరిస్తున్నాను.

10. సాన్నిధ్యం కురు కళ్యాణీ మమ పూజాగృహే శుభే।
బింబే దీపే తథా పుష్పే హరిద్రా కుంకుమే మమ॥

నా పూజా గృహములోని దేవీ దేవతల మూర్తులపైనా జ్యోతులపైనా, పుష్పములపైనా, పూజింపబడిన కుంకుమపైన నీ అపార కరుణను నిరంతరం ప్రసరింప చేయవలసినదిగా ప్రార్థిస్తూ నమస్కరిస్తున్నాను.

11. అభిరామ్యా ఇదం స్తోత్రం యః పఠేచ్ఛక్తిసన్నిధౌ।
ఆయుర్బలం యశో వర్చో మంగళం చ భవేత్సుఖమ్॥

పరమ పవిత్రమైన అభిరామి స్తోత్రాన్ని, ఎవరు నిరంతరం ఆ తల్లి ముందు కూర్చుని పఠిస్తారో, జగన్మాత అభిరామి వారికి దీర్ఘ ఆయుస్సును, బలమును, కీర్తి-యశస్సులను, ఐశ్వర్యాన్ని, అదృష్టాన్ని ప్రసాదించి ఆశీర్వదిస్తుంది.

//ఇతి శ్రీ అభిరామభట్టు కృత అభిరామి స్తోత్రమ్ సమ్పూర్ణమ్//







కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.–944 044 9650, 994 994 1430)

Kiron Type Institute